# మంచు పొరలు

## యలమంచిలి శేషగిరి రావు

తన హాండ్ బాగ్ ఎవరో కదిలిస్తున్నట్టనిపించి ఉలిక్కిపడి బాగ్ వంక చూసింది మాలతి. అప్పుడే జిప్ తీసిన చెయ్యి లోపలికి చొరబడటానికి ప్రయత్నిస్తోంది. ఒక్క క్షణం కంగారు పుట్టింది ఆమెకు. నిలబడటానికి కూడా స్థలం లేనంతగా కిక్కిరిసి ఉన్నారు జనం బస్సులో. ఊపిరి పీల్చుకోవడమే కష్టంగా ఉంది.

జనం మధ్య ఇరుక్కుపోయిన తన చేతిని అతి కష్టంమీద కదిల్చి, ఆ చేతిమీద వేసి పట్టుకుంది. గబుక్కున తన చేతిని లాగేసుకున్నాడు ఆ మనిషి. ఆ చేతిని వదిలేసి దాని తాలూకు వ్యక్తిని చూసింది. అతను ఆమెవైపు చూడకుండా, జనం మధ్య నుంచి తోసుకుంటూ ముందు డోరువైపు వెళ్ళాడు.

బస్సు మెట్టుగూడా స్టేజీలో ఆగింది. మహతి కూడా గబగబా ముందువైపుకి కదిలింది. అతను దిగాడు. తరువాత నలుగైరుదుగురు ఆడవాళ్ళు దిగారు. వెనకాల మహతి కూడా దిగింది. బస్సు కదిలింది. బస్సులో నుంచి దిగినవాళ్ళు ఎవరి దారిన వాళ్ళు వెళ్తున్నారు.

చలికాలం కావడంతో సాయంత్రం ఆరు గంటలు కూడా కాకుండానే చీకట్లు ముసురుకుంటున్నాయి.

ఆఫీసులు వదిలే వేళ.

సిటీ బస్సులు చాలా రద్దీగా ఉన్నాయి. దూరంగా మరో బస్సు వస్తూ కనబడింది. ఆమె అతనికోసం వెదికింది. వచ్చే బస్సువైపు కదులుతూ కనిపించాడు అతను.

వేగంగా అతనివైపు నడిచి వెనకనుంచి అతన్ని "ఏయ్ మిస్టర్" అంటూ పిలిచింది.

ఎవరో ఆడమనిషి తనని పిలుస్తున్నట్టనిపించి వెనక్కి తిరిగాడు అతను. ఏం కావాలన్నట్టు చిరాగ్గా ముఖం పెట్టాడు.

"నీతో కాస్త మాట్లాడాలి. మరోలా అనుకోకపోతే నాతో అలా వస్తావా?" అడిగింది ఆమె.

ఆమె అడిగిన తీరుకి మంత్రముగ్ధుడిలా వచ్చే బస్సుకోసం ప్రయత్నించకుండా ఆగిపోయాడు.

ఆ వచ్చిన బస్సు కూడా వెళ్ళిపోయింది. రోడ్డుమీద జనం కాస్త పలుచబడ్డారు.

"నాతో ఏం పని నీకు?" కరుకుగా ఉన్నాయి అతని మాటలు. ఆ కరుకుదనం తెచ్చిపెట్టుకున్నట్లుంది. ఆ కరుకుదనం వెనుక లీలగా అప్పుడే పసితనం వీడిన గొంతు వినబడింది.

"మనం ఇక్కడే నిలబడి మాట్లాడుకుంటే నలుగురూ చూస్తారు, బాగుండదు. అలా నడుస్తూ మాట్లాడుకుందాం పద" అంది మహతి.

"నీతో మాట్లాడటం తప్ప మరేం పని లేదా నాకు?"

"పర్వాలేదు. నా గురించి ఓ గంట ఖర్చు చేస్తే నీ కొచ్చే నష్టమేం లేదులే పద."

ఆమె గొంతులోని తీయదనానికి లోబడిన వాడిలా ఆమె వెంట కదిలాడు. ఇద్దరూ తార్నాక వైపుగా నడక సాగించారు.

"నీ పేరేంటి?"

"రాజా." జవాబిచ్చాడు కాస్త గర్వంగా.

"ఏ ఊరికి?" కాస్త వ్యంగ్యం తొంగిచూసింది ఆమె ప్రశ్నలో.

కోపంగా చూశాడు మహతి వైపు.

"కోపం తెచ్చుకోకు. నీ దే ఊరు అని అడిగానంతే." నవ్వాపుకుంటూ అంది మహతి.

జవాబు ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయాడు అతను.

మెల్లగా నడుస్తున్నారు ఇద్దరూ. విశాలమైన రోడ్డు అది. పెద్దగా రద్దీ ఉండదు. అప్పు డొక వాహనం, అప్పు డొక వాహనం వెళ్తూ ఉంటాయి.

అప్పుడే వెలిగిన వీధి లైట్ల వెలుగులో అతన్ని పరిశీలనగా చూసింది. ఇరవై ఏళ్ళు కూడా మించని ప్రాయం. ముఖంలో పసితనం లేకపోయినా లేతదనం వీడలేదు. మనిషి చాలా శుభ్రంగా ఉన్నాడు. చక్కగా టక్ చేశాడు. చూడటానికి డిగ్రీ స్టూడెంట్‌లా ఉన్నాడు. అతను జేబులు కొడుతూ జీవిస్తుంటాడన్న నిజాన్ని ఒప్పుకోలేకపోతోంది మహతి.

"ఏం చదువుకున్నావు?" నెమ్మదిగా అడిగింది.

"మనకి చదువా? హ్హి హ్హి" వంకరగా నవ్వుతున్న అతని పెదవుల వంక చూసింది, బాగా సిగరెట్లు తాగుతున్నట్టుగా నల్లబడి ఉన్నాయి ఆ లేత పెదవులు. సిగరెట్ తీసి వెలిగించబోయాడు.

"సిగరెట్లు తాగేవాళ్ళంటే నా కసహ్యం." అతని ప్రయత్నాన్ని నివారించటానికి చెప్పిం దామె.

ఆగిపోయా డతను. "అయితే నాతో అసలు మాట్లాడలేవు నువ్వు. నా గురించి పూర్తిగా తెలియదు నీకు" అని వెనక్కి తిరిగి వెళ్ళబోయాడు.

"తెలుసు. పైకి సంస్కారవంతుడిగా కనబడుతూ, జేబులు కొడుతూ సాటి మనుషుల కన్నీళ్ళు తాగి దాహం తీర్చుకొనే వచ్చి దొంగవని." కటువుగా చెప్పిం దామె.

వెళ్ళబోయేవాడల్లా ఖంగుతిన్నట్టు ఆగి ఆమె వంక చూశాడు. రక్తమంతా ముఖంలోకి తన్నుకొచ్చినట్లుగా ఎర్రబడింది అతని ముఖం.

"ఈ బాగ్ చూడు" తన హాండ్ బాగ్ చూపించింది. గుర్తించనట్టు ముఖం పెట్టాడు.

"అవునులే, నీకు గుర్తుండాల్సిన అవసరం లేదు. రోజు కెన్ని బాగులు, పర్సులో కదా ! ఇప్పుడు నువ్వు దిగిన బస్సులో నుంచే నేనూ దిగాను. పాపం బస్సులో నీ ప్రయత్నానికి అడ్డు తగిలినట్టున్నాను కదా !" అం దామె.

సమాధానం చెప్పలేదు రాజా.

మళ్ళీ నడక సాగించింది మహతి. తప్పదన్నట్టుగా ఆమెతో నడుస్తున్నాడు అతను.

"ఇవా ళెన్ని జేబులు కొట్టావు?" అడిగిం దామె.

మాట్లాడలేదు రాజా.

"పర్వాలేదులే. నిన్ను నేనేం పోలీసులకి పట్టివ్వను."


"అయితే నాతో పనేంటి నీకు?"


"పనుంది. పట్టిచ్చే దాన్నయితే ఇందాకే బస్సులోనే అరిచి అల్లరి చేసేదాన్ని. ఈ పాటికి నీ ఎముకలు మిగిలేవి కావు."

"ఇలాంటివి నాకు కొత్త కావు." నిర్లక్ష్యంగా చెప్పాడు రాజా.

"అది గొప్పతనం అనుకుంటున్నావా? అయినా నేను అడిగిన దానికి సమాధానం చెప్పవేంటి?" ఇవా ళెన్ని పర్సులు కొట్టేశావు?" రెట్టించి అడిగిం దామె.

"ఎందుకు?"





"వాటి వెనుక ఎన్ని కన్నీటి కథ లుంటాయో నీకు చూపించటానికి."

"అవన్నీ ఆలోచిస్తే నాకు గడవదు." హేళనగా చెప్పాడు.

"అంటే నీకు గడవటం గురించి వాళ్ళ కడుపులు కొడతావా?" తీవ్రంగా అడిగింది మహతి.

"చూడు. వాళ్ళు ఏం బాధలు పడతారనేది నా కనవసరం. అయినా ఇందాకటి నుండి చూస్తున్నా. నీ సొమ్మేం పోలేదుగా, అనవసరంగా నాతో నీకేంటి? నీ పనేదో నువ్వు చూసుకో. ఇప్పుడు నీ బాగు లాక్కెళ్ళినా నువ్వేమీ చేయలేవు. కానీ... నే నా పని చేయను. ఇందాక బస్సులో నన్ను నలుగురికీ పట్టివ్వలేదన్నది నాకు గుర్తుంది. వస్తా" అంటూ వెనుతిరిగి వెళ్ళబోయాడు.

అతని చెయ్యి పట్టుకుని ఆపింది మహతి. "చాలు. ఆమాత్రం జ్ఞానం నీలో ఉందీ అంటే, నువ్వు బాగుపడటం అంత కష్టమేమీ కాదు. కాదనకుండా నాతో రా. ఇక్కడ తార్నాకలోనే మా ఫ్రెండ్ ఉన్నాడు. అక్కడి కెళ్ళి మాట్లాడుకుందాం పద." లాలనగా అడిగింది మహతి.

"ఫ్రెండు అని చెప్పి నన్ను పోలీసులకి పట్టివ్వాలని చూశావే, నాకేం పర్వాలేదు. పోలీసు కస్టడీలూ, దెబ్బలూ నాకేం కొత్త కావు. కానీ ఆ తరువాత నాబోటి వాళ్ళనుంచి ఎదురయ్యే ప్రమాదాలు నీకు కొత్తనుకుంటాను, తట్టుకోలేవు."

"నీకు ముందే చెప్పాను. నిన్నేం చేయను. నీ మాటల్ని నేను నమ్మకపోయినా ఆశ్చర్యపడాల్సింది లేదు గానీ, నా మాటల్ని నువ్వు నమ్మి తీరాలి. ఎందుకంటే నేను నీలా దొంగని కాను."

ఆమె నుంచి ఎటువంటి ప్రమాదం ఉండదని అనిపించింది కాబోలు మారు మాట్లాడకుండా ఆమె వెంట నడిచాడు.

** ** **

కాలింగ్ బెల్ నొక్కింది మహతి. తలుపుకున్న నేం ప్లేట్ వంక చూశాడు రాజా. 'విజయకుమార్ - ఫోటో గ్రాఫర్' అని ఉంది.

తలుపు తెరుచుకుంది. దృఢంగా పాతికేళ్ళు పైబడ్డ యువకుడు కనిపించాడు ఎదురుగా.

"హేయ్ మహతీ, ఏమిటిలా వచ్చావు? ఇంటి కెళ్ళలేదా?" నవ్వుతూ పలకరించాడు.

"వెళ్ళలేదు విజయ్. దారిలో ఫ్రెండ్ కనబడితే నీకు పరిచయం చేద్దామని వచ్చాను. లోపలికి రా రాజా. ఇతను విజయ్‌కుమార్. నా బెస్ట్ ఫ్రెండ్. విజయ్! ఇతను రాజా" అంటూ ఒకరి కొకరికి పరిచయం చేసింది.

"హలో ! కూర్చో మిస్టర్ రాజా" అంటూ పలకరించాడు విజయ్.

మహతి, విజయ్ కుర్చీల్లో కూర్చున్నారు. రాజా కూర్చోలేదు. ఎంత దొంగయినా ఆ వ్యక్తుల్ని ఆ వాతావరణాన్ని చూసి కాస్త జంకాడు. 'ఛ ఇవాళ నా కిస్మత్ బాగోలేదు. అనవసరంగా ఈమె దగ్గర ఇరుక్కుపోయాను. హాయిగా ఫుడ్ కొట్టి సెకండ్ షోకి వెళ్దా మనుకొన్నాను' మనసులో అనుకున్నాడు.

"పర్వాలేదు రాజా కూర్చో. మొహమాటపడకు" అని కూర్చోపెట్టింది రాజాని మహతి. తరువాత జరిగిన విషయమంతా విజయ్‌కు వివరించింది. చిరునవ్వుతో విన్నాడు విజయ్.

తన స్నేహితురాలి డబ్బు కొట్టేయబోయాడన్న కోపం గానీ, ఆవేశం గానీ అతనిలో కనబడకపోవడం ఎంతో ఆశ్చర్యం కలిగించింది రాజాకి, వాళ్ళిద్దరి వింత వ్యక్తిత్వం ఏమని అర్థం చేసుకోవాలో తెలియలేదు.

"టీ తెస్తాను కూర్చోండి" అంటూ లేవబోయాడు విజయ్.

"నేను కలిపి తీసుకువస్తాను. ఈలోపు నువ్వు రాజాతో మాట్లాడుతూ ఉంటు" అంటూ మహతి లోపలి గదిలోకి వెళ్ళింది.

కొంతసేపు మౌనంగా గడిచింది. రాజాని పరిశీలనగా చూస్తూ - "చూడు మిస్టర్. మమ్మల్ని చూసి నీ కీపాటికి అర్థమై ఉంటుంది, మేము ప్రమాదకరమైన వ్యక్తులం కామని. సరే. ఇవాళ నువ్వు దొంగతనం... అయాం సారీ... నీ అవసరానికి వేరే వాళ్ళ జేబుల్లో నుంచి తీసిన పర్సులు చూపించు ఒకసారి." అడిగాడు విజయ్.

నవ్వుతూ మాట్లాడుతున్నా అతని ఆకారం చూసి అప్పటికే సగం నీరుకారిన రాజా, బనీను లోపలి నుంచి రెండు పర్సులు, ఒక ఆడవాళ్ళ జేబురుమాలు తీసి విజయ్ ముందున్న టీపాయ్ మీదుంచాడు.

వాటిని తీసి పరిశీలించాడు విజయ్. అనుకోకుండా మూడింటిలోనూ వాటి తాలూకు యజమానుల అడ్రసులు ఉన్నాయి. ఒకటి టి. నరేశం గౌడ్, రెండోది సి. వి. మహదేవన్, మూడోది కె. రాజేశ్వరి.

అప్పుడే మహతి టీ కప్పులతో వచ్చింది. "ఏమంటున్నాడు మన ఫ్రెండ్?" అంది టీ కప్పు లందిస్తూ.

"ఏముంది? మనకి పని పెట్టాడు. ముగ్గురి అడ్రసులు దొరికాయి. ఎవరి డబ్బు వారికి పంపేద్దామా?" టీ తాగుతూ అన్నాడు విజయ్.

"అది కాదు విజయ్. వాళ్ళ కీ డబ్బు అందించ మొక్కటే ప్రధానమైతే ఇతన్ని ఇంత దూరం తీసుకురానవసరంలేదు. బస్సులోనే ఇతన్ని నలుగురికీ పట్టిచ్చి ఎవరి డబ్బుని వాళ్ళకి అందేట్టు చేసేదాన్ని. అదికాదు ముఖ్యం. ఇతను చేసే ఈ పనులవల్ల నష్టపోయిన వాళ్ళు ఎంత మథన పడుతున్నారనేది ఇతనికి చూపించాలి. తాను చేసే పని ఎంత నీచమైందో అర్థమవ్వాలి."

నిదానంగానే చెప్పినా మహతి మాటల్లో ఆవేశం కనబడింది విజయ్‌కి.

ఒక్క నిముషం ఎవరూ ఏం మాట్లాడలేదు. మౌనంగా టీ తాగడం పూర్తి చేశారు.

"ఏం రాజా ఏమంటావు? ఈ అడ్రస్సుల ప్రకారం వెళ్దామా?" అతని వంక చూస్తూ అడిగాడు విజయ్.

"వద్దు అవసరం లేదు. ఇక నన్ను వదిలేయండి దయచేసి. ఇక నుంచి ఈ జీవితాన్ని వదిలేస్తాను." వాళ్ళ వంక చూడలేక తల వంచుకుని లేచి నిలబడ్డాడు రాజా.

"వీల్లేదు. నువ్వు వాళ్ళని కలవాలి. వాళ్ళనుభవించే బాధను ప్రత్యక్షంగా చూడాలి. శాశ్వతంగా నువ్వీ పాడు జీవితాన్ని వదలాలంటే మాతో రాక తప్పదు. కంగారుపడకు. వాళ్ళముందు తల వంచుకునేట్లు డబ్బు దొంగిలించింది నువ్వేనని చెప్పం. విజయ్ ! పద" అంటూ లేచింది మహతి.

** ** **

సమయం ఏడున్నర అయింది. యూసుఫ్‌గూడా దగ్గర కృష్ణానగర్‌లో ఆటో దిగారు ముగ్గురూ. నరేశంగౌడ్ అడ్రసున్న కాగితం తీసి చూసి, అక్కడ ఓ కిరాణా షాపులో దారి అడిగాడు విజయ్. షాపతను చెప్పిన గుర్తుల ప్రకారం ఆ ఇంటిని కనుక్కునేసరికి పావుగంట పట్టింది.

అది రేకుల కప్పున్న ఓ చిన్న గది. తలుపులు కొద్దిగా తెరిచి ఉన్నాయి. లోపలినుంచి సన్నగా మాటలు వినబడుతున్నాయి.

"ఊర్కో అయ్యా. బాధపడి ఫాయిదా ఏంటి? మనకి నసీబ్ లేదంతే." ఓ ఆడగొంతు దీనంగా పలికింది.

తలుపు తట్టాడు విజయ్. "ఎవరూ?" అంటూ తలుపు తీశాడు ఏభై ఏళ్ళు పైబడ్డ వృద్ధుడు. అతని కళ్ళలో దైన్యం కనబడుతోంది. కాకీపాంటు, వెలిసిపోయి ఏ రంగో తెలియని చొక్కా వేసుకున్నాడు. లోపలి ఆడమనిషి బహుశా అతడి భార్య కావచ్చు, ఓ మూలన కూర్చుంది.

"ఎవరు కావాలి సార్ మీకు?" అడిగా డా వృద్ధుడు.

"నరేశం గౌడ్ అంటే మీరేనా?"

"ఆ... అవున్సార్ నేనే." - తనకోసం వచ్చే వాళ్ళెవరూ లేరే అని ఆశ్చర్యపోతూ అన్నాడు.

"మీతో కొంచెం పనుండి వచ్చాము. లోపలికి రావచ్చా?" అడిగింది మహతి.

"రాండ్రి రాండ్రి. కూసోనికి కుర్సీభీ లే" అంటూ చుట్టూ కలయచూసి మూలనున్న ఓ చింకిచాప పరిచాడు అతను.

ముగ్గురూ కూర్చున్నారు.

"మరేం లేదు. మేము ఒక వారపత్రికలో పని చేస్తున్నాము. వృద్ధాప్యంలో ఉన్న మీలాంటి వారిని ఇంటర్వ్యూ చేస్తూ ఇలా వచ్చాం. అంటే మీనుంచి విషయాలు తెలుసుకోడానికన్న మాట." చెప్పింది మహతి.

"ఇసయాలా? మాకాడ నేం దొరుకుతాయమ్మ చెప్పనీకి?"

"అలా అనొద్దు. మీరెలా జీవిస్తున్నారు? ఈ వయస్సులో మీ కెలా గడుస్తోంది? అనే వాటి గురించి దయచేసి చెప్పండి" అనునయంగా అడిగిం దామె.

"ఈ నెలెలా గడుస్తుందాని మేం పరేసాన్ అయితుంటే ఏం చెప్పమంటావ్ తల్లీ?" దీనంగా చెప్పాడు ఆ వృద్ధుడు.

"అదేంటి కొంచెం వివరంగా చెప్పండి."

"ఈ పగలంతా కష్టపడి పన్జేసిన నెల్లాళ్ళ కష్టం చార్ సౌ ఎవడో దొంగనాయలు చోరీ చేసిండు. ఇంగ ఈ నెలంతా ఏం దినాలె?"

"ఏమిటి? నీ సొమ్ము పోయిందా? ఎలా?" అని వృద్ధుణ్ణి అడిగి రాజా వంక చూసింది మహతి.

అతని ముఖంలో ఏ భావమూ కదలాడటంలేదు, తల వంచుకుని తన చేతి వేళ్ళ వంక చూస్తున్నాడు.

"నా నౌకరీ సికిందరాబాద్ టేసన్ కాడ ఓ కంపెన్లో అటెండర్ని. దఫ్తర్ అయినాక టేసన్ కాడ బస్సెక్కిన. టిక్కెట్టు తీయాలని పర్సు కోసం జూసిన. లేదు. ఎక్కేటప్పుడే ఎవుడో కొట్టేసిండు. అయినా నా అసుమంటి గరీబోని దగ్గర్నే చోరీ చేయాల్నా వాడు ! ఈ దేశం జేబుల్నే కొట్టేసే ఎందరో దొంగనాయా ళ్ళున్నరు. ఆలనందర్నీ ఇడిసిపెట్టి నాకాడ్నే కొట్టేసిండు." బాధగా చెప్పాడు.

"మరి మీకు బిడ్డల్లేరా? వాళ్ళు చూడరా మిమ్మల్ని"

"బిడ్డలా? ఉన్నాడు ఒకడు. వాడు మా కడుపున పుట్టిన పాపాన్కి రెక్కలొచ్చిందాక మాతానే ఉన్నాడు. జోడీ దొరికింది. ఎగిరిపోయిండు. మేం ముసలి కంపుగొట్టినం. మా కర్మాన మమ్మల్ని ఎల్లగొట్టిండు. ఇంతేలే అనుకున్నం. ఎవురో మీలాంటి పున్నాత్ముడు. గీ నౌకరీ ఇప్పించ్చిండు. గిట్లనే బతకాల. లేన్నాడు చెరింత ఇసం మింగి సావాల. ఆయాల చాలా దూరానుందనుకున్నాం గానీ, గా పని ఇయ్యాల్నే చేయల్నని సమజైంది. నెలంతా ఈ పానాల్కి గింత బువ్వ లేకుండా గెట్ల బతకాలె తల్లీ?" దుఃఖంతో అతని గొంతు పూడుకపోయింది. జీవంలేని గాజు కళ్ళలో నుంచి ముడతలు పడ్డ బుగ్గల మీదకి నిశ్శబ్దంగా జారాయి కన్నీళ్ళు. అతని భార్య మౌనంగా రోదిస్తోంది.



భారంగా నిట్టూర్చి లేచి నిలబడింది మహతి. "మా పత్రిక వారు ఇలా ఇంటర్వ్యూ ఇచ్చిన వారికి పారితోషికం ఇస్తారు. ఇవిగో ఈ డబ్బు తీసుకోండి, ఈ నెల గడవడానికి ఉపయోగపడతాయి." అంటూ తన హేండు బాగులో నుండి, నరేశం గౌడ్ పర్సులో నుంచి తీసి ఉంచిన డబ్బును అతనికి అందించింది.

బ్రతుకుమీద ఆశ చిగురించినట్టుగా ఆ గాజు కళ్ళలో జీవం తొంగి చూసింది. "ఆరిపోయి బుగ్గయిపోవాల్సిన ఈ జీవాల్ని ఎలిగిస్తున్నవు తల్లీ. నల్లంగుండు" అంటూ ఆ డబ్బుని అందుకున్నాడు ఆనందంగా నరేశం గౌడ్. రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టారు ఆ వృద్ధ దంపతులు.

"మరి మేం వస్తాం" అంటూ బయటికి వచ్చారు మహతి, విజయ్‌లు.

తల వంచుకుని వారిని అనుసరించాడు రాజా.

** ** **

సమయం ఎనిమిదింపావు అయింది.

ఖైరతాబాద్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్. విజిటర్స్ హాల్లో కూర్చుని ఉన్నారు మహతి, విజయ్, రాజాలు.

హాల్లోకి ప్రవేశించింది ముప్పై ఏళ్ళున్న యువతి. చెప్పుకోదగ్గ అందం కాకపోయినా, పర్వాలే దనిపించేలా ఉం దామె.

"నాకోసం కబురు పెట్టిందీ..." అంటూ సందిగ్ధంగా ఆగింది ఆమె.

మహతి లేచి నిలబడుతూ - "అవును మేమే. నా పేరు మహతి. ఇతను విజయ్, ఇతను రాజా" అంటూ పరిచయం చేసింది.

"నమస్తే. కూర్చోండి" అంది రాజేశ్వరి.

ఆమె వంక పరిశీలనగా చూసింది మహతి. ఆమె వదనం కాస్త వడిలినట్టుగా ఉంది. ముఖంలో అదోరకమైన అసంతృప్తి, దానివల్ల ఏర్పడిన రఫ్‌నెస్ కనబడుతోంది. "మిమ్మల్ని నేను గుర్తించలేకపోతున్నాను." మహతి మాట్లాడకపోయేసరికి మొహమాటంగా అంది రాజేశ్వరి.

"నాతో మీకు ఇంతకుముందు పరిచయం లేదులెండి. సికింద్రాబాద్ స్టేషన్ దగ్గర బస్ టెర్మినస్‌లో ఈ కర్చీఫ్ దొరికింది. తీసి చూస్తే ఇందులో డబ్బు, రైలు రిజర్వేషన్ ఫారం కనబడ్డాయి. ఫారంలో మీ అడ్రసు చూసి మీ కందివ్వాలని ఇలా వచ్చాము. తీసుకోండి" అంటూ అందించింది మహతి.

ఒక్కసారిగా రాజేశ్వరి ముఖంలో సంతోషం కొట్టొచ్చినట్లు కనబడింది. "చాలా థాంక్సండీ. మా ఊరు వెళ్దామని ట్రైన్ రిజర్వేషన్ కోసం స్టేషన్ వెళ్ళాను. రిజర్వేషన్ దొరకలేదు. ఇవాళిచ్చిన నా జీతం, ఫారం కర్చీఫ్‌లో పెట్టి బాగ్‌లో పెట్టుకున్నాను. ఇక్కడి కొచ్చి చూసుకుంటే లేదు. ఇహ ఈ డబ్బు మీద ఆశ వదులుకున్నాను. నిజంగా ఈ రోజుల్లో కూడా మీబోటి వారుండటం అరుదు. థాంక్స్" అంటూ మహతి చేతుల్ని ఊపేసిం దామె.

"మీరు ఎక్కడ వర్క్ చేస్తున్నారు?" అడిగింది మహతి.

"పార్క్‌లేన్‌లో ఉన్న ఓ బట్టల షోరూంలో సేల్స్ ఉమెన్‌గా చేస్తున్నాను" అం దామె మెల్లగా.

"మీరు మరోలా భావించకపోతే మీ వివరాలు చెప్పగలరా?"

"వివరాలా? చెప్పడానికేం ఉన్నాయి?" అంటూ తటపటాయించింది రాజేశ్వరి.

"అభ్యంతరం లేకుంటేనే సుమా" అన్నాడు అప్పటిదాకా మౌనంగా ఉన్న విజయ్.

"నా నెల కష్టార్జితం పోగొట్టుకుని, నాది కాదు అని ఆశ వదులుకున్న నా సొమ్ముని ఎంతో భద్రంగా నాకు అప్పగించారు మీరు. అలాంటి మీకు నా వివరాలు చెప్పటానికి అభ్యంతరం ఏముంటుంది?"

"మా ఊరు బందరు దగ్గర ఓ పల్లెటూరు. బాగా చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఇంటి పరిస్థితుల వల్ల శక్తిలేక ఇంటర్‌తోనే ఆపేశాను. మా నాన్నకి ఉన్న కొద్దిపాటి పొలం మీద వచ్చే ఆదాయంలో మమ్మల్ని పోషించటానికే తల మునక లయ్యేవారు, ఇక నా పెళ్ళేం చేస్తారు? నా కో చెల్లెలుంది. అ దిప్పుడు టెన్త్ చదువుతోంది. నా పెళ్ళి చేయలేని మా నాన్న అశక్తతని నేను వేలెత్తి చూపను. ఆయన మాత్రం ఏం చేస్తారు? ఉన్న పొలం అమ్మి నా పెళ్ళి చేస్తే ఆ తరువాత వాళ్ళెలా జీవిస్తారు? చెల్లెల్ని ఏం చేస్తారు? కట్నం లేకుండా చేసుకునే ఉదారస్వభావులు ఎవరున్నారు ఈ రోజుల్లో?

"స్నేహితురాలి సహాయంతో ఇక్కడికి వచ్చి ఈ ఉద్యోగంలో చేరి ఆరేళ్ళు అయింది. అప్పటి నుంచి నా సంపాదనలో కొంత కూడబెట్టుకుంటున్నాను- కనీసం నా పెళ్ళి నేనే చేసుకుందామనే ఉద్దేశంతో. కానీ పెళ్ళికొడుకుల కట్నం టార్గెట్ లాగానే నా వయసు కూడా పెరిగిపోతోంది. ఇంకో రెండేళ్ళు చూద్దా మనుకుంటున్నాను. నా సేవింగ్స్‌తో ఎవర్నయినా కొనుక్కోగలిగితే సరే, లేదా ఇలాగే కోర్కెల అగ్నిగుండంలో కాలి బూడిదనైపోతాను చివరికి. ఈ డబ్బు కనీసం నా చెల్లెలికైనా ఉపయోగపడుతుంది. అది కూడా నాలాగే నిరర్థక జీవితం గడపాల్సిన అగత్యం ఉండదు. నాకు పెళ్ళంటూ జరక్కపోతే, దాని గురించి నేనేం బాధపడను. వృద్ధాప్యంలో ఉన్న అమ్మా నాన్నకి తోడుగా బ్రతుకుతాను. వాళ్ళ కడుపున పుట్టినందుకు ఆమాత్రమైనా నేను ఋణం తీర్చుకోవాలి కదా !" దుఃఖభారంతో ఆమె గొంతు పూడుకుపోయింది.

వింటున్న ముగ్గురి మనసులూ భారంగా అయ్యాయి.

"మీ వివరాలు అడిగి మిమ్మల్ని చాలా బాధపెట్టి నట్లున్నాము. వెరీ సారీ" అంది మహతి లేస్తూ.

"ప్లీజ్, నా మీద జాలి చూపించవద్దు. నా జీవితం ఇలా ఉందని నేనేం బాధపడటంలేదు" అంది రాజేశ్వరి ఆవేశంగా.

ఆ ఆవేశం వెనుక ఎంత ఆవేదన ఉందో, తొణికీ తొణకని ఆమె మానసిక స్థితినీ, ఆత్మాభిమానాన్నీ అర్థం చేసుకోగలిగింది మహతి. రాజా వంక చూసిం దామె - 'చూశావా నీకు తెలియని ప్రపంచంలో ఎన్ని ఆవేదనలూ, కన్నీళ్ళూ ఉన్నాయో' అన్నట్టుగా.

ఆమె వంక సూటిగా చూడలేక తల దించుకున్నాడు రాజా.

"మేం వెళ్ళొస్తాం రాజేశ్వరిగారూ ! ఏదయినా నా సహాయం అవసర మనిపిస్తే నన్ను తప్పక కలవండి. ఇది నా కార్డు" అంటూ తన బాగ్‌లో నుంచి విజిటింగ్ కార్డు తీసి ఆమెకి అందించింది మహతి. అసోసియేటెడ్ ఎడిటర్, "రమ్యా" వారపత్రిక చిరునామా ఉంది ఆ కార్డులో.

"మరోసారి మీ ముగ్గురికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అంది రాజేశ్వరి నిండుగా నమస్కరిస్తూ.


ప్రతిగా నమస్కరించి బయటికి వచ్చేశారు ముగ్గురూ.

** ** **

"మహతీ! ఇందాక నేను సరిగ్గా చూడలేదు గానీ, ఈ మహదేవన్ అనే అతను మన ఆఫీసులోనే టైప్ సెట్టింగ్ సెక్షన్‌లో చేసే అతనే. ఇదిగో అతని ఇంటి అడ్రసుతో పాటు మన ఆఫీసు అడ్రసు కూడా ఉంది ఈ పర్సులో" అన్నాడు విజయ్ పర్సు మహతికి అందిస్తూ.

"సరే. అయితే అతన్ని మన ఆఫీసులోనే రేపు కలుద్దాం. ఇప్పు డెలాగూ పొద్దుపోయింది కదా ! ఇంట్లో అమ్మా నాన్నా కంగారుపడుతుంటారు."

రాజా వాళ్ళకి కొద్ది దూరంలో నిలబడ్డాడు.



సమయం తొమ్మిది గంట లయింది. టెలిఫోన్ భవన్ దగ్గర నిలబడ్డారు వాళ్ళు.

"మరి ఇతన్ని ఏం చేద్దాం?" అడిగాడు విజయ్.

రాజా అది విని వాళ్ళకి దగ్గరగా వస్తూ - "నన్ను ఇక వదిలేయండి, వెళ్ళిపోతాను. జీవితంలో మరెన్నడూ ఇలాంటి పనులు చేయను. నిజం... నన్ను నమ్మండి" అన్నాడు మెల్లగా.

నరేశం గౌడ్‌ని, రాజేశ్వరిని కలిశాక అతను చాలా మానసిక సంఘర్షణకి లోనైనట్టుగా ఉంది అతని ముఖం. వాళ్ళిద్దరి వంకా సూటిగా చూడలేకపోతున్నాడు.

"నువ్వు ఎక్క డుంటున్నావు?" అడిగింది మహతి.

"బోయిన్‌పల్లిలో నా బోటివాడే మరొక డున్నాడు. అతనితో కలిసి ఉంటున్నాను."

"నీ సామానేమైనా ఉందా అక్కడ?"

"పెద్దగా ఏం లేదు. నాలుగు జతల బట్టలు, రెండు దుప్పట్లు మాత్రమే ఉన్నాయి."

"అయితే ఇక నువ్వు అక్కడికి వెళ్ళకు. పూర్తిగా ఆ ప్రపంచాన్ని మరిచిపో. నీ ఉనికి కూడా నీ తోటివాళ్ళకి తెలియనీయకు. తెలిస్తే నిన్ను మళ్ళీ ఆ కూపంలోకి లాగాలని చూస్తారు. విజయ్! నీకు అభ్యంతరం లేదు కదా ఇతను నీతో రెండు రోజులుంటే?"

"భలేదానివే. కొత్తవాళ్ళకి చెప్పినట్టు చెప్తున్నావే నాకు!" నవ్వుతూ అన్నాడు విజయ్.

"రాజా! విజయ్ కూడా బాచిలరే. ప్రస్తుతం అతనితో ఉండు. రేపు విజయ్‌తో పాటు ఆఫీసుకి రా. అక్కడ ఆలోచిద్దాం ఏం చేయాలన్నదీ." రాజాతో చెప్పింది మహతి.

మాట్లాడలేదు రాజా.

"ఇంతకీ నీ దే ఊరు?"

"ఏ ఊరో, ఏం పేరో కూడా తెలియదు నాకు. ఈ లోకంలోకి ఎలా వచ్చానో కూడా తెలియదు. ఊహ తెలిసిన దగ్గర్నుంచి ఇక్కడే ఉంటున్నాను. ఆకలేసినప్పుడల్లా ఇదే పని చేస్తున్నాను. పట్టుబడినప్పుడల్లా నన్ను హింసించేవారే గానీ, ఇలా మంచీ చెడూ చెప్పి, లోకాన్ని చూపించి నన్ను మార్చడానికి ప్రయత్నించలేదు ఎవరూ.. ఇప్పుడు మీరేం చెబితే అది చేస్తాను."

చాలా నిజాయితీగా అతని గుండెల్లో నుంచి వచ్చినట్టుగా ఉన్నాయి ఆ మాటలు. చాలా ఆనంద మనిపించింది మహతికీ, విజయ్‌కీ.

"గుడ్. అయితే రేపు విజయ్‌తో ఆఫీసుకి రా. మా ఎడిటర్‌తో చెప్పి నీకు ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తాను. నామోషీ పడకుండా ఏదైనా చెయ్యి. సరేనా" అంది మహతి.

'సరే' అన్నట్టుగా తలూపాడు రాజా.

అప్పుడే అటుగా ఒక ఆటో వచ్చి ఆగింది. అందులో ఎక్కి వెళ్ళిపోయింది మహతి.

వెనకాల వచ్చిన బస్సులో ఎక్కారు విజయ్, రాజాలు.

** ** **

"మహతి, మన ఫ్రెండ్ వెళ్ళిపోయాడు" అన్నాడు విజయ్ - తన కెమెరా టేబుల్ మీద పెట్టి, మహతి ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ.

అప్పుడే టైప్ సెట్టింగ్ సెక్షన్‌కి వెళ్ళి మహదేవన్‌కి వర్క్ అందించి వచ్చి, ఆ రోజు లే అవుట్స్ చేయించాల్సిన మాటర్ చూస్తోం దామె.

ఆశ్చర్యంగా చూసింది విజయ్ వంక.



"నిజమే మహతీ. రాత్రి ఇద్దరూ హొటల్లో భోజనం చేసి రూం కెళ్ళి పడుకున్నాం. తెల్లారి లేచేసరికి మనిషి మాయం."

"నీ డబ్బు ఏమయినా..."

"ఆఁ, అదే చెప్పబోతున్నా. హేంగర్‌కి తగిలించిన నా షర్టు జేబులో నుంచి ఒక ఏభై రూపాయలు తగ్గినాయి. నాకు ఆశ్చర్య మనిపించింది ఒక్కటే, నిన్నే అందుకున్న నా జీతం అంతా జేబులోనే ఉంది. కానీ అందులో నుంచి ఏభై మాత్రమే తీసుకెళ్ళాడు. ఏనీవే మన ఎక్స్‌పెరిమెంట్ ఫెయిల్ అయింది. ఇక మర్చిపో ఆ విషయాన్ని" అంటూ కిట్ తీసుకుని వెళ్ళిపోయాడు విజయ్.

విజయ్ వెళ్ళిపోయినా ఆమె అలాగే విజయ్ కూర్చున్న కుర్చీ వంక చూస్తూ ఉండిపోయింది. విజయ్ చెప్పిన విషయాన్ని అంత త్వరగా జీర్ణించుకోలేకపోతోంది. దీర్ఘంగా నిట్టూర్చింది.

చలి ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మంచు పొరల అడుగున నీరు ఉంటుందట. మంచు కరిగిపోగానే నీరు ఉపయోగపడుతుంది. అలాగే రాజా మనసులోని చెడు గడ్డకట్టిన అలాంటి మంచుపొరే అనుకుంది తను. ఆ పొరను సులభంగా కరిగించవచ్చు అని ప్రయత్నించింది, కానీ అతని మనసులో కరుడుగట్టింది ఇనుప తెర గానీ మంచు పొర కాదని తెలిసింది.

** ** **

వారం గడిచింది. దాదాపు ఆ విషయాన్ని ఇద్దరూ మరిచిపోయారు.

ఓ రోజు సాయంత్రం అయిదున్నర అయింది సమయం. తన సెక్షన్ నుండి బయటికి వచ్చింది మహతి. అప్పుడే బైక్ మీద గేటులోకి ప్రవేశిస్తూ కనిపించాడు విజయ్. బైక్‌ని స్టాండులో పెట్టి మహతి దగ్గరికి వచ్చాడు.

"మధ్యాహ్నం నుంచి నీకోసం చూస్తున్నా ఏమైపోయావు?"

"పొల్యూషన్ మీద ఆర్టికల్ ప్రిపేర్ చేస్తున్నారట గదా! దానికి సంబంధించి ఇండస్ట్రియల్ ఏరియాలో ఫోటోలు తీసుకు రమ్మని పంపారు ఎడిటర్‌గారు. బాలానగర్ వెళ్ళి వస్తున్నాను." చెప్పాడు విజయ్.

"నీతో మాట్లాడాలి."

"వస్తా నుండు- ఫిల్మ్ కేసెట్ అసిస్టెంట్ కిచ్చి" అని లోపలికి వెళ్ళి అయిదు నిమిషాల్లో వచ్చాడు.

బైక్ మీద ఇద్దరూ కలిసి ఓ హొటల్‌కి వెళ్ళి ఓ మూలగా కూర్చున్నారు. రెండు కాఫీ ఆర్డరిచ్చి అడిగాడు విజయ్- "ఏంటి మహతీ విశేషం?"

"ఈ ఏభై రూపాయలు తీసుకో. మన ఫ్రెండ్ పంపాడు." బాగ్‌లో నుంచి తీసిచ్చింది మహతి.

"ఫ్రెండా?" అర్థం కాక అడిగాడు.

"రాజాని మరిచిపోయావా ఏంటి? ఎం. ఓ చేశాడు. ఓ లెటర్ కూడా రాశాడు. ఇదిగో చదువు." ఉత్తరం అందించింది మహతి.

కుతూహలంగా ఆ ఉత్తరం అందుకుని చదవడం మొదలుపెట్టాడు.

"గౌరవనీయులైన మహతిగారికి,

నమస్కారాలు. ఈపాటికి మీ మనసుల్లో నాకు ఏ రకమైన స్థానం ఏర్పడి ఉంటుందో నే నూహించుకోగలను. మంచితనం, మానవత్వం మీద మీ రుంచిన నమ్మకాన్ని నేను నిలబెట్టుకోలేక, నిజం చెప్పడానికి ముఖం చెల్లక వచ్చేశాను. ముఖతా మీకు చెప్పలేకపోయిన విషయాల్ని రాస్తున్నాను. నన్ను అర్థం చేసుకోగలరు. నా గురించి మీకు చెప్పిన విషయాలన్నీ అబద్ధాలు.

మాది ఖమ్మం. మా నాన్నగారు డాక్టరు. ఇద్ద రన్నదమ్ములం, ఒక చెల్లెలు. మా నాన్నగారు చాలా క్రమశిక్షణ గల మనిషి. అయినా స్నేహితులవల్లనో, నా బలహీన మనస్తత్వం వల్లనో కొన్ని అలవాట్లకి లోనయ్యాను. చిన్నతనం నుంచి ఇంట్లో చిల్లర దొంగతనాలు చేసేవాడిని. నేను హైదరాబాద్ రాకముందు - అంటే మూడు నెలల క్రితంవరకు కాలేజీకి వెళ్తూ బియస్సీ ఫస్టియర్ చదువుతూ ఉండేవాడిని. ఓ రోజు మా నాన్నగారి జేబులో నుంచి డబ్బు తీస్తుండగా ఆయనకి పట్టుబడ్డాను. ఆ రోజు ఆయనలో అంత కోపాన్ని నే నెన్నడూ చూడలేదు. సరైన అవగాహనలేని మనసుతో పౌరుషానికి పోయి ఇంట్లో నుంచి వచ్చేశాను. తీరా వచ్చాక ఏం చేయాలో అర్థం కాలేదు. కొన్నాళ్ళు వెంట తెచ్చుకున్న సొమ్ముతో గడిపేశాను. అప్పుడే ఒక వ్యక్తి నా వయసువాడే పరిచయమయ్యాడు. ఇన్నాళ్ళూ అతనితోనే తిరుగుతూ, అతని లాగానే దొంగతనాలు చేస్తూ గడిపేశాను. ఇంటికి తిరిగి వెళ్ళడానికి అభిమానం అడ్డు వచ్చి వెళ్ళలేదు. చివరికి నా అదృష్టం కొద్దీ మీరు కలిశారు. నిజంగా మీరు చూపించిన ప్రపంచం నాకు తెలియనిదే. ఆ రోజే నా ఆలోచనల్ని మార్చుకున్నాను.

నా మీద ఎంతో నమ్మకం ఉంచి విజయ్‌గారు నిద్రపోయారు ఆ రోజు. అది వమ్ము చేసి ఆయన జేబులో నుంచి ఏభై రూపాయలు దొంగిలించాను. కానీ అప్పుడే నిర్ణయించుకున్నాను- జీవితంలో అదే ఆఖరి దొంగతనమని. అది కూడా బస్ ఛార్జీల గురించి తీసుకున్నాను. ఏభై రూపాయలకు ఎం. ఓ. పంపుతున్నాను. ఆయనకు అందజేయగలరు. అలాగే నన్ను క్షమించమని చెప్పండి.

అక్కడి నుంచి తిన్నగా ఇంటికి వచ్చేశాను. అమ్మా నాన్నలు నన్ను క్షమించి అక్కున జేర్చుకున్నారు. సృష్టిలోని మహిమ అదే కాబోలు, పిల్లలు ఎన్ని తప్పులు చేసినా తల్లితండ్రులు క్షమించి దరి చేర్చుకుంటారు. ప్రస్తుతం నేను మళ్ళీ కాలేజీకి వెళ్తున్నాను. తిరిగి నేను మనిషిగా నిలబడ్డాక, మీ ముందు తలెత్తుకునేలాగా రూపొందేక కలుస్తాను. అప్పటివరకు మీ ఆశీస్సులు కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

ఇట్లు మీ
రాజా."

ఉత్తరం చదవడం పూర్తి చేసి మెరిసే కళ్ళతో మహతి వంక చూశాడు విజయ్. ★